రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

- చింతపల్లిలో ఐదుగురు.. అడ్డగూడూరులో ఇద్దరు..
- అడ్డగూడూరులో బోల్తాపడిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటనలు నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం, యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలాల్లో బుధవారం జరిగాయి. చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పివిఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో మూల మలుపు వద్ద కారు, బైకు ఢీకొని ఐదుగురు మృతిచెందారు. అడ్డగూడూరులో ఆర్‌టిసి బస్సు బోల్తాపడి ఇద్దరు చనిపోయారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

నల్లగొండ జిల్లా పిఎ పల్లి మండలం అక్కంపల్లికి చెందిన మద్దిమడుగు ప్రసాద్ భార్య, కుమారుడితో కలిసి కొండమల్లేపల్లి వైపు బైక్‌పై వెళ్తుండగా చింతపల్లి వైపు వెళు న్న కారు ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న ముగ్గురిలో



ప్రసాద్(38), అతని కుమారుడు అవినాష్(12) అక్కడికక్కడే మృతిచెందారు. ప్రసాద్ భార్య మద్దిమడుగు రమణ (35)కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో డ్రైవర్ పట్నపు మణిపాల్(18) అక్కడికక్కడే మృతిచెందారు. పులి పవన్, వారాల మణివర్ధన్, వనం మల్లికార్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని చింతపల్లి పోలీసులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మద్దిమడుగు రమణ(35), వనం మల్లికార్జున్(18) మృతి చెందారు. పులి పవన్, వారాల మణివర్ధన్ పరిస్థితి నిలకడగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

ఆర్‌టిసి బస్సు బోల్తా..

అడ్డగూడూరు మండలం కంచనపల్లి-బొడ్డుగూడెం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఆర్‌టిసి బస్సు బోల్తా పడటంతో ఇద్దరు మృతిచెందారు. తొర్రూరు ఆర్‌టిసి డిపో బస్సు 40 మంది ప్రయాణికులతో జగదీర్‌గుట్టకు వెళ్తోంది. మధ్యాహ్న సమయంలో అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి, బొడ్డుగూడెం గ్రామ సమీపంలో బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ప్రయాణికులు చుక్క యాకమ్మ (50), కొండ రాములు(60) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు స్థానికుల సహాయంతో ప్రయాణికులను బయటకు తీశారు. గాయపడిన వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

రాష్ట్రానికి వర్ష సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దాని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అల్పపీడనం ప్రస్తుతం వాయవ్య బంగాళాఖాతం పరిసరాలలోని పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాల్లో కొనసాగుతుందని పేర్కొంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టం నుంచి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు ఆవర్తనం కొనసాగుతుందని తెలిపింది. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశ వైపు వాలి ఉందని, రాగల రెండు రోజులలో వాయవ్య దిశగా కదిలి ఝార్ఖండ్ మీదుగా వెళ్లే అవకాశం ఉన్నట్లు వివరించింది. వీటి ప్రభావంతో రాగల మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని చెప్పింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్‌తో పాటు ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది.

దిల్‌సుఖ్‌నగర్‌లో ఒలివా స్కిన్ క్లినిక్ ప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ డెర్మటాలజీ క్లినిక్ చైన్ చైన్, వివిధ రకాల చర్మం, జుట్టు సమస్యలకు అధునాతన వైద్య పరిష్కారాలు అందించే ఒలివా స్కిన్, హెయిర్ క్లినిక్‌ను దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. బుధవారం దీనిని రిటైర్డ్ ఐపిఎస్ అధికారులు సంతోష్ మాచర్ల, వి శివకుమార్, టిఎస్‌టిడిసి మాజీ చైర్మన్ ఉప్పాల శ్రీనివాస్, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ట్రస్ట్ అధ్యక్షులు తేలుకుంట్ల రమేష్ గుప్తా ప్రారంభించారు. ఇది భారతదేశంలో తమకు 25వ క్లినిక్ అని ఒలివా స్కిన్, హెయిర్ క్లినిక్ సిఇఒ డాక్టర్ సోమ ప్రశాంత్ తెలిపారు. నగరంలో 7వ క్లినిక్ అని పేర్కొన్నారు. నూతన సెంటర్ ద్వారా ఒలివా తన ప్రయాణంలో మరో మైలురాయిని అధిగమించిందన్నారు.

అన్నీ భూ కబ్జాలు, ఆక్రమణలే

- ఆలేరు ఎమ్మెల్యే భర్త మహేందర్‌రెడ్డిపై అయోధ్యరెడ్డి విమర్శలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



నాడు వైట్ రేషన్‌కార్డు... నేడు వందల కోట్లు ఎలా వచ్చాయని టిపిసిసి అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి ఆలేరు ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆలేరు నియోజకవర్గంలో భూకబ్జాలు, ఆక్రమణలు చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిఎస్ఐఐసి కోసం తుర్కపల్లిలో భూ సేకరణ చేస్తున్నారని చెప్పారు. సర్వే నెంబర్ 72లో 155 ఎకరాల భూమి ఉంటే, 108 ఎకరాల భూమికి నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఇందులో 93 ఎకరాలు మాత్రమే టిఎస్ఐఐసికి తీసుకుందని చెప్పారు. మిగిలిన 15 ఎకరాల భూమి ఆలేరు ఎమ్మెల్యే సునితా మహేందర్‌రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. మిగిలిన 15 ఎకరాల భూమిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 43 మంది రైతుల దగ్గర తీసుకున్న భూమికి ప్రభుత్వం ఇచ్చిన చెక్‌లు బౌన్స్ అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో బీఆర్ఎస్‌లో వణుకు మొదలైందన్నారు. ఆ భయంతోనే మంత్రి హరీశ్‌రావు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఐటి కారిడార్‌లో ఎలక్ట్రిక్ బస్సులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ నగరానికి తలమానికమైన ఐటి కారిడార్‌లో గ్రీన్ మెట్రో లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులను రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్‌టిసి ఎండి సజ్జనార్ ప్రారంభించారు. బుధవారం ప్రారంభించిన 25 కొత్త బస్సులు సెప్టెంబరు 23 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సులకు గతంలో కేంద్రం రాయితీ ఇచ్చేదని, ఇప్పుడు చేతులెత్తేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ విషయంలో చేయూత ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. టిఎస్‌ఆర్‌టిసిని పరిరక్షించుకోవడానికి సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం మంచి పరిణామమన్నారు. ఇది తన హయాంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఆరు నెలల్లో ఐటి సెక్టార్‌లో 470 బస్సులు తీసుకొస్తామని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు. బస్సుల్లో అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించామని తెలిపారు.

నా సీటు వదులుకునేందుకు సిద్ధం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా రిజర్వేషన్ బిల్లును పూర్తిగా స్వాగతిస్తున్నామని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ తెలిపారు. మాదాపూర్‌లో ఇంటర్నేషనల్ టెక్‌పార్క్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ "మహిళా నేతలు చాలా మంది రావాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్‌లో భాగంగా నా సీటు పోతే పోనివ్వండి. మన జీవితాలు చాలా చిన్నవి, నా పాత్ర నేను పోషించాను" అని కెటిఆర్ వ్యాఖ్యానించారు.

టెట్ ప్రాథమిక కీ విడుదల

- 23 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక కీని పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1, పేపర్-2 ప్రశ్నాపత్రాలకు సంబంధించిన ప్రాథమిక కీని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. వాటిపై అభ్యంతరాలను ఈ నెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు https://tstet.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇతర పద్ధతుల్లో వాటిని స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఈ నెల 15న నిర్వహించిన టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,26,744 (84.12 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,89,963 (91.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.

అటవీ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం..

- గిరిజన హక్కులకోసం ఐక్య పోరాటాలు
- ఆర్మ్ జాతీయ నాలుగో మహాసభలో బి వెంకట్

ప్రజాశక్తి -హైదరాబాద్

దేశంలోని అటవీ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెటేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రపన్నుతోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. తమిళనాడులో జరుగుతున్న అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ నాలుగో మహాసభల సందర్భంగా ఆయన సౌహార్ధ సందేశాన్ని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. వారు నివాసముంటున్న ప్రాంతాల్లోని విలువైన ఖనిజ, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాదిమంది గిరిజనులను భూ నిర్వాసితులుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు లక్షలాది ఎకరాలుగా ఉన్నా వాటిని గిరిజనులు, పేదలకు పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ భూములను పేదలు, గిరిజనులు ఆక్రమించుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో భారీగా నిధులు తగ్గించి, కొట్లాదిమంది పేదలను ఉపాధి పనులకు దూరం చేసిందని ఆరోపించారు. ప్రజలను విభజించే బిజెపి విధానాలకు వ్యతిరేకంగా గిరిజనులు ,పేదలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల ఉల్లంఘనతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలపై ప్రభుత్వ దాడి ,విద్యా కాషాయికరణకు వ్యతిరేకంగా, మణిపూర్ మారణ హోమానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ పలు తీర్మానాలను మహాసభ ప్రతినిధులు ఆమోదించారు.

నవంబర్‌లో డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు జరగనున్నాయి. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డిఎస్‌సి) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ ఈ నెల ఎనిమిదో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. డిఎస్‌సి రాతపరీక్షల నిర్వహణ తేదీలను పాఠశాల విద్యాశాఖ ఖరారు చేసి బుధవారం విడుదల చేసింది. నవంబర్ 20,21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టుల రాతపరీక్షలు జరుగుతాయి. అదేనెల 22న స్కూల్ అసిస్టెంట్ అన్ని లాంగ్వేజ్ సబ్జెక్టుల పరీక్షలు, 23న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పిఇటి) అభ్యర్థులకు పరీక్షలు ఉంటాయి. 24న లాంగ్వేజ్ పండితులకు రెండు విడతల్లో ఉంటుంది. 25 నుంచి 30 వరకు ఆరు రోజులపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి) అభ్యర్థులకు రాతపరీక్షలను రోజూ రెండు విడతల్లో నిర్వహిస్తారు. అయితే 160 ప్రశ్నలకు 80 మార్కుల చొప్పున 2.30 గంటలపాటు డిఎస్‌సి రాత పరీక్షలుంటాయి. టెట్‌లో వచ్చిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఆ రెండింటినీ కలిపి డిఎస్‌సి మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఇతర వివరాలకు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ప్రతిభావంతులకు రాగ సప్త స్వరం ఎఎన్‌ఆర్ రజిత పతక ప్రదానం

ప్రజాశక్తి - కల్చరల్

విఖ్యాత నటుడు పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగ సప్తస్వరం తిరుమల గ్రూప్స్ నంగునూరి చంద్రశేఖర్ సహకారంతో వివిధ రంగాలలో ప్రతిభావంతులకు ఈ నెల 27. న శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై రజిత పతక ప్రదానం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పత్రికను ఇక్కడి ఒక హోటల్‌లో నంగనూరి చంద్రశేఖర్ సంస్థ అధ్యక్షురాలు రాజ్య లక్ష్మితో కలసి విడుదల చేసి మాట్లాడారు. అక్కినేనికి తిరుమల గ్రూపుతో గత మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. తమ సంస్థ ప్రతి వేడుకకు ఆయన తమ సంస్థలో ఒకరుగా పాల్గొన్నారని ఇందుకు కారణం తాము నాణ్యం సేవలు చేయటమే కారణం అన్నారు. రాజ్య లక్ష్మి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా అక్కినేని పేరిట ప్రముఖులు పలువురికి తిరుమల గ్రూపు వారి సహకారంతో అవార్డ్స్ అందజేస్తున్నామని ఆయన చివరగా పాల్గొన్న కార్యక్రమం తమ సంస్థదేనని తెలిపారు. ఈ సారి మానేపల్లి జూఎలర్స్ సహకారంతో రజిత పతకాలు సినీ జర్నలిస్ట్ ఇమంది రామారావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ భాస్కర్, సీనియర్ డబ్బింగ్ కళాకారిణి జానకి, రచయిత్రి ఉషారాణి, గాయకులు రామాచారి, వినోద్ బాబు, శశికళ, సురేఖలకు బహుకరిస్తున్నమని తెలిపారు. నాటి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ పాల్గొనగా చంద్రశేఖర్ అధ్యక్షత వహిస్తారు.అతిధులుగా డాక్టర్ మోహన్ వంశీ,నటుడు సుమంత్, మనేపల్లి మురళికృష్ణ, సురేంద్ర , సెల్ వెల్ బండారు సుబ్బారావు, వంశీ రామ రాజు పాల్గొంటారు

జిఒ 142 రద్దు చేయాలి

- నేడు సమ్మె నోటీస్ అందజేత
- అక్టోబర్ ఐదు తర్వాత నిరవధిక సమ్మె
- వైద్యారోగ్యశాఖ డాక్టర్స్, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్, అసోసియేషన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఒ 142 రద్దు చేయాలని వైద్యారోగ్యశాఖలోని డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్ అసోసియేషన్స్‌ల రాష్ట్ర సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం హైదరాబాద్ కోఠి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ప్రాంగణంలోని టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర కార్యాలయంలో కె సాయిరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. అనంతరం జీవో 142 రద్దు పోరాట కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో డాక్టర్ల యూనియన్ నుంచి డాక్టర్ బి రమేష్, డాక్టర్ పి ప్రవీణ్, డాక్టర్ లాలు ప్రసాద్, డాక్టర్ నరహరి,టిఆర్ఎస్కెవి నుంచి సుదర్శన్, రాజశేఖర్, రాబర్ట్‌బ్రూస్, సీఐటీయూ నుంచి యాదానాయక్, బలరాం, ఐఎన్‌టియుసి నుంచి శ్యాంసుందర్, వెంకటేశ్వర రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ నెల 21న రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీస్ ఇవ్వాలని, 25న 33 జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు చేసి కలెక్టర్లకు, డిఎంహెచ్‌ఒలకు వినతిపత్రాలివ్వాలని తీర్మానించారు. అక్టోబర్ మూడున ఛలో హైదరాబాద్, డిహెచ్ కార్యాలయం ముందు మహాధర్నా, అనంతరం జిఒ రద్దు కాకపోతే అక్టోబర్ ఐదు తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో గెజిటెడ్ అధికారుల నుంచి కలిముద్దీన్ అహ్మద్, శ్రీనివాసులు, సిహెచ్‌ఒల అసోసియేషన్ నుంచి బి నెహ్రూచంద్, చంద్ర ప్రకాష్, హెల్త్ ఎక్సటెన్షన్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ నుంచి కొప్పు ప్రసాద్, ఇ కిరణ్ రెడ్డి, హెచ్‌ఇఒల యూనియన్ నుంచి వెంకటరామ్ రెడ్డి, ఎఎన్ఎం, హెచ్‌విపిహెచ్ఎన్ అసోసియేషన్ నుంచి రామేశ్వరి, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నుంచి రామలక్ష్మి, సుజాత రాథోడ్, ఫార్మసిస్టుల అసోసియేషన్ నుంచి బత్తిని సుదర్శన్ గౌడ్, డిపిఎంఒ లా యూనియన్ నుంచి సకలారెడ్డి, దేవ్ సింగ్, మినిస్ట్రియల్ ఉద్యోగుల నుంచి కిషన్ మాట్లాడారు. వీరితో పాటు వేణుగోపాల్ గౌడ్, అనసూర్య, మాధవరెడ్డి, పసియుద్దీన్,హరి శంకర్, భాస్కర్, సోమయ్య, రాజయ్య, యాదమ్మ, నాందేవ్, ప్రకాష్, సాంబయ్య, గోపీచంద్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పిఆర్‌సిని ఏర్పాటు చేయాలి

- మధ్యంతర భృతిని ప్రకటించాలి
- టిఎన్‌జిఒ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, జగదీశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన వేతన సవరణ కమిషన్ (పిఆర్‌సి) కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని టిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో టిఎన్‌జిఒ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను సుదీర్ఘంగా చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా రాజేందర్, జగదీశ్వర్ మాట్లాడుతూ 2023 జులై ఒకటి నుంచి వర్తింపచేసేలా పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని కోరారు. అందుకనుగుణంగా ఐఆర్‌ను మంజూరు చేయాలని సూచించారు. 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి నియామకమైన ఉద్యోగులకు అమలు చేస్తున్న సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) ఆలస్యం చేయకుండా అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు



ఎదుర్కొంటున్న సమస్యలను, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను, నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పదోన్నతులు, ప్రతినెలా జీతభత్యాలను నెల మొదటి రోజున విడుదల చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

ఎఐసిసి రమ్మంటోంది.. టిపిసిసి వద్దంటోంది

- వైఎస్ షర్మిల చేరిక 'పెండింగ్'
- ఆంధ్రా పెత్తనమంటూ విమర్శలొస్తాయేమోనని అనుమానం
- బిఆర్ఎస్‌కు మరోసారి సెంటిమెంట్ అవకాశమిచ్చినట్టువుతుందని అంచనా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్‌లో చేరాలనే వైఎస్ షర్మిల ప్రయత్నాలు ఫలించడం లేదు. ఆమె చేరికను ఎఐసిసి అధిష్టానం తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టింది. ఈ విషయంలో పిసిసి, ఎఐసిసి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె కాంగ్రెస్‌లో చేరితే తమకు అభ్యంతరం లేదంటూనే... తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కాకుండా ఎపిలో చేరాలని సూచిస్తున్నారు. ఆమె సేవలు అక్కడే ఉపయోగించుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సూచించినట్టు తెలిసింది. షర్మిల చేరికపై ఎఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ... స్థానికంగా పార్టీ అవసరాల దృష్ట్యా రాష్ట్ర నాయకులు వద్దంటున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో వైఎస్‌ఆర్‌టిపిని విలీనం చేయాలని నిర్ణయించుకున్న ఆమె... నేరుగా కర్నాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. వారి మధ్య చర్చలు సఫలమైన తర్వాత ఢిల్లీలో సోనియా, రాహుల్‌గాంధీని కలిసిన విషయం తెలిసిందే. వైఎస్‌ఆర్ ఆశయాలను కాంగ్రెస్‌పార్టీ మాత్రమే నెరవేర్చగలదనే నమ్మకంతో ఉన్నట్టు కూడా షర్మిల ప్రకటించారు. సిడబ్ల్యుసి సమావేశాల సందర్భంగా మళ్లీ డీకేతోనూ సమావేశమయ్యారు. ఇలా అగ్రనేతలతో షర్మిల సమావేశమైన తర్వాత రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త అనుమానం మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షర్మిల రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరి, ఇక్కడ ఏదో ఒక నియోజకవర్గంలో పోటీ చేయడం ద్వారా పార్టీకి ఇబ్బందులొస్తాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. పార్టీ పెట్టే సమయంలో వైఎస్ షర్మిల ఖమ్మం కోడలిగానూ, హైదరాబాద్‌లో పుట్టిన పెరిగిన విషయాలను ప్రస్తావించారు. సొంత పార్టీ పెట్టి తెలంగాణ రాష్ట్రంలో పాదయాత్ర కూడా చేశారు. షర్మిలకు వ్యక్తిగతంగా ఛరిష్మా ఉన్నప్పటికీ పార్టీ పరంగా ప్రజల్లో పెద్దగా ఆదరణ లభించలేదు. దీంతో వైఎస్‌ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలనే వైపు ఆమె అడుగులేశారు. దీన్ని పసిగట్టిన కాంగ్రెస్ నేతలు అధిష్టానానికి ఇక్కడి రాజకీయ పరిణామాలను వివరించారు. దీంతో ఆమె చేరిక తాత్కాలికంగా వాయిదా పడింది. ఎన్నకల సమయంలో వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరితే, అది బీఆర్ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు తెలంగాణ సెంటిమెంటు రెచ్చగొట్టడానికి అస్త్రంగా మారుతుందని టిపిసిసి నేతలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బద్ధ వ్యతిరేకి అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల... రాష్ట్రంలో పెత్తనం చేసేందుకు వస్తున్నారంటూ కేసీఆర్ రెచ్చగొట్టే ప్రమాదం ఉందని పార్టీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికార పార్టీ తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొట్టేందుకు అవకాశం కోసం కాచుకుని కూర్చుంది. మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వైఎస్ షర్మిల, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ గడ్డపై జమవుతున్నారంటూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. ఆంధ్రా ప్రాంతానికి చెందిన నేతలు రాష్ట్రంలో పాగ వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన పరోక్షంగా కాంగ్రెస్‌నుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో షర్మిల, కేవీపీ పార్టీలో చేరితే అది బిఆర్ఎస్‌కు ఎన్నికల అస్త్రంగా మారుతుందని చెబుతున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పంపుహౌస్ ప్రారంభోత్సవంలోనూ సీఎం కేసీఆర్ పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకంతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన నేతల గురించి ప్రస్తావనను గుర్తు చేయడం ద్వారా భవిష్యత్తులో వారి పెత్తనాన్ని సహించేది లేదంటూ పరోక్షంగా వ్యాఖ్యానించారు.

కొందరికే హెచ్‌ఎం ఉద్యోగోన్నతులు

- నేడు, రేపు స్కూల్ అసిస్టెంట్లు వెబ్‌ఆప్షన్ల నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


రాష్ట్రంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ (జిహెచ్‌ఎం) గ్రేడ్-2 ఉద్యోగోన్నతులకు సంబంధించి అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు గురు, శుక్రవారాల్లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మల్టీ జోన్-1 పరిధిలో ప్రభుత్వ, లోకల్ బాడీలోని పాఠశాలలకు వెబ్‌ఆప్షన్లను ఇవ్వాలని కోరారు. మల్టీ జోన్-2 పరిధిలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లోని పాఠశాలలకే స్కూల్ అసిస్టెంట్లు ఆప్షన్లు నమోదు చేయాలని సూచించారు. హైకోర్టు ఆదేశాలతో మల్టీ జోన్-2 పరిధిలో లోకల్ బాడీలోని పాఠశాలల్లో జీహెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టులకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కొందరికీ పదోన్నతులు లభిస్తాయి. అందుకే గురు, శుక్రవారాల్లో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టు పదోన్నతుల కోసం వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని సూచించారు. ఈనెల 23న ఆప్షన్ల సవరణకు అవకాశమిస్తామని తెలిపారు. సీనియార్టీ జాబితా ఆధారంగా ఆప్షన్లను ప్రాధాన్యతా క్రమంలో నమోదు చేయాలని సూచించారు. అయితే జీహెచ్‌ఎం గ్రేడ్-2 పదోన్నతులకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్లకు నాట్ విల్లింగ్ ఆప్షన్‌ను పొందుపరిచామని వివరించారు. ఎవరైనా ఉద్యోగోన్నతులు అవసరం లేదని భావిస్తే నాట్ విల్లింగ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలని కోరారు. కొన్ని ఆప్షన్లు ఇచ్చిన తర్వాత కూడా నాట్ విల్లింగ్ ఆప్షన్‌ను ఎంచుకునే అవకాశముందని సూచించారు.

'బాబుతో నేను' పోస్టర్ ఆవిష్కరణ

- సిగ్నేచర్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం శ్రేణులు సిగ్నేచర్ క్యాంపెయిన్ చేపట్టాయి. అలాగే 'బాబుతో నేను' పోస్టర్‌ను సైతం ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ భవన్ వద్ద తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు భవనం షకిలారెడ్డి ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఎన్‌టిఆర్ భవన్ మెయిన్‌గేట్ ఎదుట బుధవారం ప్రదర్శించారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ప్రకటించారు. ఎపి ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు, రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు షకీలారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలంపల్లి అశోక్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లీలా పద్మావతి, ఐటి ఉద్యోగులు, ఎన్‌టిఆర్ భవన్ సిబ్బంది, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఒరైమో నుంచి కొత్త ఫ్రీపాడ్స్ లైట్ ఇయర్‌బడ్స్ విడుదల


ప్రజాశక్తి -హైదరాబాద్

ఆడియో ఇన్నోవేషన్ ఉత్పత్తుల కంపెనీ ఒరైమో కొత్తగా 'ఫ్రీపోడ్స్ లైట్' ఇయర్‌బడ్స్‌ను విడుదల చేసింది. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 40 గంటల పాటు వీడిని వాడుకోవచ్చని ఆ సంస్థ పేర్కొంది. కేవలం పది నిమిషాలు ఛార్జింగ్ చేస్తే 120 నిమిషాల వరకు వినియోగించవచ్చని తెలిపింది. దీని ధర రూ.వెయ్యి దిగువన ఉంటుందని పేర్కొంది. తమ ఉత్పత్తులకు బాలీవుట్ నటీ మృణాల్ ఠాకూర్‌తో క్యాంపెయిన్ చేస్తోన్నట్లు తెలిపింది. ఫ్రీపోడ్స్ క్రిస్టల్ క్లియర్ ధ్వనీతో సంగీత ప్రియులకు మంచి అనుభూతిని అందిస్తుందని వెల్లడించింది.

కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు పాలమూరు విజయం

- మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో



కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు పాలమూరు విజయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకంపై ఎపి దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్‌పై కృష్ణా ట్రైబ్యునల్ తీర్పును మంత్రి స్వాగతించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టిఎంసిల వరకు కృష్ణా జలాలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. తాజా తీర్పు ద్వారా సబ్ జ్యూడిస్ అడ్డంకి తొలగిపోయినట్లుగా భావించవచ్చని తేల్చిచెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ, మోటా, కేంద్ర భూగర్భ జలశాఖ, విద్యుత్ ప్రాధికార సంస్థ, కేంద్ర మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ లాంటి సంస్థల అన్ని రకాల అనుమతులు వచ్చాయని వెల్లడించారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సిఎం కెసిఆర్ పట్టుదలే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల అడ్డంకులు కేంద్రం వెంటనే గుర్తించి తొలగించాలని సూచించారు. కృష్ణా నదిలో తెలంగాణ నీటివాటా కూడా కేంద్రం వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ మూఠా అరెస్ట్

- 1030 గ్రాముల చెరాస్, 2 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరితోపాటు మరో నిందితున్ని నార్కోటెక్ బ్యూరో అరెస్టు బుధవారం చేసింది. నార్కోటెక్ బ్యూరో ఎస్‌పి జి చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన హైదర్ ఎక్బాల్ సిద్ధి మక్వా, ముస్తాక్ షా డ్రాగ్స్ సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. ఇద్దరూ డ్రగ్స్ తీసుకుని పహాడీషరీఫ్‌కు వచ్చినట్టు సమాచారం అందుకున్న నార్కోటెక్ బ్యూరో అప్రమత్తమైంది. పహాడీషరీఫ్ పోలీసులతో కలిసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితులిచ్చిన సమాచారంతో డ్రగ్స్ ఉపయోగిస్తున్న పహాడీషరీఫ్‌కు చెందిన సయ్యద్ జావీద్‌ను అరెస్టు చేశారు. నిందితులు విద్యార్థులకు, యువతకు, ఇతరులకు డ్రగ్స్, గంజాయి సరఫరా చేస్తున్నారు. వారి నుంచి ఏడు లక్షల విలువగల 1030 గ్రాముల చెరాస్, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

22న చేనేత కార్మికుల జాతీయ కన్వెన్షన్

- ఆయా రాష్ట్రాల నుంచి 200కిపైగా ప్రతినిధుల హాజరు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఈ రంగానికి సంక్షోభం
- మగ్గమున్న ప్రతి కార్మికునికి రూ.పది లక్షల చేనేత బంధు ఇవ్వాలి
- తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత చేనేత కార్మికుల జాతీయ కన్వెన్షన్‌ను ఈ నెల 22న నిర్వహించనున్నట్టు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రకటించారు. ఆయా రాష్ట్రాల నుంచి 200కిపైగా ప్రతి నిధులు హాజరుకానున్నారని చెప్పారు. ఈ కన్వెన్షన్‌లో చేనేత కార్మికుల స్థితిగతులు, చేయాల్సిన పోరాటాలపై చర్చిస్తామనీ, చేనేత రంగాన్ని బతికించుకునేందుకు దేశవ్యాప్తంగా పోరాడేందుకు జాతీయ స్థాయిలో ఒక స్టీరింగ్ కమిటీ వేస్తామని చెప్పారు. మగ్గం ఉన్నప్రతి చేనేత కార్మికునికి రూ.10 లక్షల చేనేత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత రంగంపైనా, ముడి సరుకులు (రసాయనాలు, నూలు, జరీ, తదితరాలు)పై జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జాతీయ కన్వెన్షన్‌ను పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని ఎస్‌వికెలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్లే దేశవ్యాప్తంగా చేనేత రంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. కేంద్రంలో మోడీ సర్కారు వచ్చాక కార్పొరేట్ కంపెనీలకు మేలు చేస్తూ పోవడం వల్ల చేనేత రంగం మరింత దివాళా తీసిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ చేనేత సంక్షేమ బోర్డును రద్దు చేసిందని, మహాత్మాగాంధీ బునకర్ బీమాయోజన, ఐసిఐసిఐ లాంబాడ్ హెల్త్ స్కీం, హౌస్ కం వర్క్ షెడ్ లాంటి కేంద్ర పథకాలను తొలగించిందని విమర్శించారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాల్ని తొక్కి పెట్టిందని, అందులో ఇప్పుడు ఐదారు అంశాలనే అమలు చేస్తున్నదని తెలిపారు. దేశంలో చేనేత రంగానికి పునర్జీవనం తీసుకురావాలంటే జాతీయ చేనేత సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలనీ, బడ్జెట్‌లో చేనేత, టెక్స్‌టైల్ రంగాలకు వేర్వేరుగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్, మిల్లులను తట్టుకుని చేనేత బతికేందుకు జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా చేనేత కార్మికులకు సమగ్రమైన పాలసీ తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు తొమ్మిదేళ్ల నుంచి ఎన్నికలు నిర్వహించకుండా వాటిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వాటికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ మాట్లాడుతూ ఈ కన్వెన్షన్‌లో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత, కోశాధికారి ఎం సాయిబాబు, కార్యదర్శి ఆర్ కరిమలయన్, తదితర జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో ఆశా, అంగన్‌వాడీ, మిడ్ డే మీల్స్ కార్మికులు, తదితర ప్రభుత్వ పథకాల సిబ్బందికి చేనేత బట్టలు అందజేసి ఆ రంగంలోని కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం గౌరవ సలహాదారులు కూరపాటి రమేశ్, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ పాల్గొన్నారు.

వండర్‌లాలో రెండు కొత్త థ్రిల్లింగ్ రైడ్లు

- రెయిన్‌బో లూప్స్, డ్రాప్ లూప్ ఏర్పాటు
- ప్రారంభించిన నటీ లావణ్య త్రిపాఠీ



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ అమ్యూజింగ్ పార్క్ చెయిన్ వండర్‌లా హాలిడేస్ తన హైదరాబాద్ యూనిట్‌లో రెండు కొత్త థ్రిల్లింగ్ వాటర్ రైడ్లను ఏర్పాటు చేసింది. రెయిన్‌బో లూప్స్, డ్రాప్ లూప్ రైడ్లను బుధవారం వండర్‌లా హాలిడేస్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె చిట్టిలపిల్లి, పార్క్ హెడ్ మధు సూధన్ జి సమక్షంలో సినీనటి లావణ్య త్రిపాఠీ లాంచనంగా ప్రారంభించారు. టర్కీ నుండి దిగుమతి చేసిన ఉల్లాసం రేకెత్తించే ఈ రెండు వాటర్ అట్రాక్షన్లను పరిచయం చేయడం ద్వారా, సందర్శకుల అనుభవాన్ని మరింత పరిపూర్ణం చేయాలని నిర్దేశించుకున్నామని అరుణ్ తెలిపారు. కొత్త వాటర్ రైడ్లు ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సందర్శకులకు వినోదం, ఉత్సాహంతో పాటు ఒక మరపురాని అనుభూతిని అందించేలా ఈ రైడ్లను రూపొందించామన్నారు. వినోదపు సరిహద్దులను విస్తరించడంతో పాటు ప్రతిఒక్కరూ సంపూర్ణంగా ఆనందించే ఒక పర్యావరణాన్ని సృష్టించడమే తమ ఉద్దేశ్యమన్నారు. రెయిన్‌బో లూప్స్, డ్రాప్ లూప్‌లను ఆవిష్కరించడాన్ని తాను సగర్వంగా భావిస్తున్నానని లావణ్య త్రిపాఠీ అన్నారు.

ఎన్నికల కోసమే మహిళా బిల్లు : పిఒడబ్ల్యు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారని ప్రగతి శీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షులు జి ఝాన్సీ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధాని మోడీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు, నారీ శక్తి వందన చట్టం (మహిళా రిజర్వేషన్ బిల్లు) బిజెపి వచ్చే ఎన్నికల్లో లబ్దిపొందేందుకేనని తెలిపారు. ప్రభుత్వ అనుకూల మీడియా దీన్ని 'బహుమతి'గా ప్రచారం చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నిజానికి ఎన్నో ఏండ్లుగా తిరస్కరిస్తున్న మహిళల హక్కు అని పేర్కొన్నారు. బిల్లును జనాభా లెక్కలు, డీలిమిటేషన్‌తో ముడిపెట్టటమేంటని ప్రశ్నించారు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్ కోటాతో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించేలా సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ, విధానసభలకే పరిమితం కాకుండా రాజ్యసభ, విధాన పరిషత్‌లకు కూడా వర్తింపజేయాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లోనే మహిళలు రాజకీయ నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని వినియోగించుకునేలా సవరణ బిల్లును అమలు చేసే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పాలకులతో రాజ్యాంగానికి విఘాతం

- ఐలూ ప్రధాన కార్యదర్శి పార్థసారధి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజకీయ, ఆర్థిక సామాజిక, స్వాతంత్రం ఉండేలా రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన పాలకులు దానికి విఘాతం కలిగిస్తున్నారని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పార్థసారధి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఐలూ సహాయ కార్యదర్శి రామచంద్రారెడ్డి, వెంకటేశ్, ప్రవీణ్, ఫాతీమా, సుదర్శన్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. 'రాజ్యాంగం భారతీయులమైన మేము' అనే అంశంపై అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న జాతీయ సెమినార్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ సెమినార్‌లో రాజ్యాంగ మౌలిక సూత్రాలు, పునఃపరిశీలన అనే అంశంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్‌సిబాల్ ప్రసంగిస్తారని తెలిపారు. 'రాజ్యాంగంలో సమాఖ్యతత్వం, వర్తమాన పరిణామాలు' అనే అంశంపై రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిటాస్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి టి రజిని మాట్లాడతారన్నారు. '75 ఏళ్లుగా న్యాయస్థానాల విశ్లేషణ' అనే అంశంపై ఒడిషా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ మురళీధర్ కీలకోపన్యాసం చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ న్యాయ కళాశాలల్లో రాజ్యాంగం వివిధ కోణాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన పాలకులే..దానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ప్రాథమిక హక్కులు హరించే విధంగా ఆర్థిక అసమానతలు పెంచి రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాణం, లక్ష్యాలు ఎదురవుతున్న సవాళ్లను మన కర్తవ్యంగా భావించి వాటిని ఎదుర్కోవలసిన సమయం ఆసన్నమైందని చెప్పారు. దేశంలో భిన్నత్వాన్ని పరిరక్షించడానికి అందరూ ఏకం కావాల్సిన పరిస్థితి నెలకుందన్నారు. రాజ్యాంగంలోని పీఠికలో రాజ్యాంగ, లక్ష్యాలు, ఆశయాలు పొందుపరిచి భారత దేశ సర్వసత్తాక ప్రజాతంత్ర లౌకిక రాజ్యాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.



జాతీయ సెమినార్ పోస్టర్ విడుదల చేస్తున్న పార్థసారధి తదితరులు

ఇకెవైసితో రేషన్ ఇక్కట్లు

- కుటుంబమంతా ఒకేసారి వేలిముద్రలతో ఇబ్బందులు
- సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారు రాక తప్పని స్థితి
- సాధ్యంకాకపోతే రేషన్‌కార్డుల్లో నుంచి వారి పేరు కట్
- ఈనెలాఖరు గడువు.. దసరా వరకు పొడిగించాలని విజ్ఞప్తులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సర్కారు రేషన్‌కార్డులపై తీసుకున్న నిర్ణయం లబ్దిదారులను ఇక్కట్లకు గురిచేస్తోంది. అస్సలైన లబ్దిదారులను గుర్తించేందుకు ఇకెవైసి (నో యువర్ కస్టమర్)ని పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇది రేషన్ కార్డుదారులను ఇబ్బందుల పాలుజేస్తోంది. బోగస్ రేషన్ కార్డుల ఏరివేతతో పాటు రేషన్ సరుకుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వాగతించాల్సిందేనైనా.. కుటుంబసభ్యులందరూ ఒకేసారి కేవైసీ పూర్తి చేయాలనడంతో ఇబ్బందికర స్థితి ఏర్పడింది. ఈ నెలాఖరు లోగా కేవైసీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 11వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో ఒకటి, రెండురోజులు వాయిదా పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ప్రక్రియపై విమర్శలు వస్తున్నాయి. దసరా సెలవుల వరకు పొడగించాలని లబ్దిదారులు విజ్ఞప్తులు చేస్తున్నారు.

అందరూ దుకాణానికి వెళ్లాలంటే అయ్యేపనిలా లేదు..

రాష్ట్రంలో రేషన్‌కార్డున్న కుటుంబసభ్యుల్లో ఎవరు వెళ్లినా వేలిముద్ర వేసి రేషన్ తీసుకుంటున్నారు. కార్డుల్లో ఎంతమంది పేర్లుంటే అందరికీ సరుకులు ఇస్తున్నారు. కుటుంబసభ్యుల్లో ఎవరైనా చనిపోయినా, పెండ్లిండ్లై వేరే చోటకు వెళ్లినా వారి పేర్లను రేషన్‌కార్డుల్లో నుంచి తొలగించడం లేదు. ఇంట్లో ఎవరో ఒకరు వెళ్లి వీరందరి పేర్లమీద రేషన్ తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం కేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఇంతవరకూ బాగానే ఉన్నా అందరూ రేషన్‌దుకాణానికి వెళ్లి వేలముద్రలు వేయాలనడంతో సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు రావడం ఇబ్బందికరంగా మారింది. కాబట్టి దసరా సెలవుల సమయంలో ఈ ప్రక్రియ చేపడితే హాస్టల్స్, వివిధ ప్రాంతాల్లో ఉంటున్న విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇకెవైసి కాకపోతే రేషన్ కట్టే..!

కుటుంబ యజమానితో పాటు రేషన్‌కార్డులో పేరున్న వాళ్లందరూ సమీప రేషన్ దుకాణానికి వెళ్లి ముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. రేషన్‌డీలర్లు ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు తీసుకుంటారు. వేలిముద్ర వేసినప్పుడు వారి ఆధార్‌కార్డు నంబర్‌తో పాటు రేషన్‌కార్డు నంబర్ డిస్‌ప్లే అవుతుంది. ఆ తర్వాత గ్రీన్‌లైట్ వచ్చి కేవైసీ ప్రక్రియ పూర్తవుతుంది. ఒకవేళ అప్పుడు రెడ్‌లైట్ వస్తే ఆధార్ నంబర్‌తో రేషన్‌కార్డు నంబర్ మ్యాచ్ కావడం లేదని కేవైసీ రిజెక్టవుతుంది. ఇలాంటి సందర్భాల్లో రేషన్‌కార్డు నుంచి సంబంధిత లబ్దిదారు పేరును తొలగిస్తారు. రేషన్ సరుకులు ఒక యూనిట్ అంటే ఒకరికి కట్ చేస్తారు. కేవైసీ కోసం కుటుంబ సభ్యులందరూ ఒకేసారి రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్రలు ఇవ్వాలనే నిబంధనతోనే అసలు సమస్య వచ్చిపడింది. ఏదైనా కారణంతో కుటుంబసభ్యుల్లో ఎవరైనా వెళ్లకపోతే.. ఫ్యామిలీ నుంచి వారు విడిపోయినట్టుగా భావించి వారి పేర్లను రేషన్‌కార్డు నుంచి తొలగిస్తారు.

రేషన్‌కార్డుంటే ఒక్క రేషనే కాదు..

ఖమ్మం జిల్లాలో 4,11,206 రేషన్‌కార్డులున్నాయి. ఇంకా రెండు లక్ష మందికి పైగా రేషన్‌కార్డులందాల్సి ఉంది. ప్రస్తుత రేషన్‌కార్డుదారులకు 11,36,226 యూనిట్ల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికీ (ఒక్కో యూనిట్) ఆరు కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నారు. రేషన్ కార్డు ద్వారా వచ్చే బియ్యం కన్నా కూడా ప్రభుత్వం వైపు నుంచి అనేక ప్రయోజనాలు లబ్దిదారులు పొందుతున్నారు. విద్యా, వైద్యం వంటి వాటిలో రాయితీలు లభిస్తున్నాయి. రేషన్ ఉపయోగించుకోవడం లేదనే పేరుతో వారి పేర్లను కార్డుల్లో నుంచి తొలగిస్తే పేద, మధ్యతరగతి ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

కాబట్టి సెలవుల సమయంలో ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

పిల్లల చదువుకు ఆటంకం

- బండి సుజాత, సింగరాయపాలెం, కొణిజర్ల

మా పాప భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని గురుకులంలో చదువుతోంది. రేషన్‌కార్డుల్లో ఉన్నవారందరూ వేలిముద్ర వేయాల్సిందేనని డీలర్ చెబుతున్నారు. కుటుంబసభ్యులందర్నీ రేషన్‌దుకాణానికి రమ్మంటే పాపను తీసుకురావాల్సి వస్తుంది. పిల్లల చదువుకు ఆటంకం ఏర్పడుతుంది కాబట్టి ఇలాంటి పనులు దసరా సెలవుల్లో పెట్టుకుంటే బాగుంటుంది.

కార్డుంటే వేలిముద్ర తప్పనిసరి..

- శ్రీలత, ఖమ్మం జిల్లా పౌరసరఫరాల అధికారి

రేషన్‌కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ కెవైసికి సంబంధిత రేషన్ దుకాణాలకు వెళ్లి వేలిముద్ర ఇవ్వాల్సిందే. రేషన్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టింది. ఈనెలాఖరు వరకు కేవైసీకి అవకాశం ఉంది.

అక్టోబర్ చివరి వరకు గడవు పొడగించాలి...

నున్నా నాగేశ్వరరావు, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి

అక్టోబర్ చివరి వరకు రేషన్‌కార్డుల కేవైసీ గడువు పొడిగించాలి. అటుఇటుగానీ సమయంలో ఇలాంటి ప్రక్రియ చేపట్టడం వల్ల దూరప్రాంతంలో ఉన్న విద్యార్థులు, ఇతరులు ఇబ్బంది పడతారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వక పదేండ్లవుతోంది. అనేక మందికి పెండ్లిండ్లయ్యాయి. పిల్లలు పుట్టారు. ఈ పేర్లేవీ రేషన్‌కార్డుల్లో నమోదు కాలేదు. కొత్త కార్డులు ఇవ్వకపోగా పాత కార్డుల రేషన్ కట్ చేసే ప్రయత్నం సరికాదు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నీలోఫర్‌లో కిడ్నాపయిన బాలుడు క్షేమం

- నిజామాబాద్‌లో గుర్తింపు
- పోలీసుల అదుపులో కిడ్నాప్ చేసిన భార్యాభర్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో అపహరణకు గురైన ఆరు నెలల బాలుడు నిజామాబాద్‌లో క్షేమంగా ఉన్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. బాలుడిని ఎత్తుకెళ్లిన దంపతులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట క్రాస్‌లోని ఓ ఫామ్‌హౌజ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సల్మాన్‌ఖాన్-ఫరీదా బేగం దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడికి అస్వస్థతగా ఉండటంతో సెప్టెంబర్ 14వ తేదీన నీలోఫర్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. రాత్రి సమయంలో మొదటి అంతస్తులో బాబుకి చికిత్స కొనసాగుతుండటంతో అక్కడే చిన్న కొడుకు (ఆరు నెలలు) ఫైజల్‌ఖాన్‌ను పట్టుకుని ఫరీదా బేగం కూర్చుంది. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఓ మహిళ.. ఆమెతో సన్నిహితంగా మెలిగింది. దీంతో భోజనం తెచ్చుకునేందుకు బాబుని అక్కడే వదిలేసి వార్డు నుంచి బయటకు వెళ్లింది. తిరిగొచ్చే సరికే బాలుడు కనిపించలేదు. దాంతో నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును సవాల్‌గా తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. కిడ్నాప్ చేసిన మహిళ నిజామాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. నిజామాబాద్ పోలీసులకు సమాచారమివ్వగా మహిళను, ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. పిల్లలు లేకపోవడంతో పెంచుకున్నందుకే బాలున్ని అపహరించినట్టు నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. పోలీసులు బాలున్ని వారి నుంచి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

రూ.2.25 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 796 పాయింట్ల పతనం

ముంబయి : గత రెండు వారాలుగా వరుస లాభాలతో జోరు మీదున్న దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలను చవి చూశాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితర బ్లూచిప్ కంపెనీల సూచీల్లో అమ్మకాల పరంపర చోటు చేసుకుంది. దీంతో వరుసగా రెండోరోజూ నష్టాలు నమోదయ్యాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల వాతావరణానికి తోడు ఇప్పటికే భారీగా పెరిగిన సూచీల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. బిఎస్‌ఇ సెన్సెక్స్ 796 పాయింట్లు కోల్పోయి 66,801కి పరిమితమయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 232 పాయింట్లు పతనమై రూ.19,980.75 వద్ద ముగిసింది. బిఎస్‌ఇలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.5 శాతం చొప్పున తగ్గాయి. ఒక్క పూటలో మదుపర్లు దాదాపు రూ.2.25 లక్షల కోట్లు నష్టపోయారు. రెండు సెషన్లలో రూ.2.89 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అత్యధికంగా 4 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2 శాతం, జెఎస్‌డబ్ల్యు స్టీల్ 2 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ పరిణామాలతో సెన్సెక్స్ 67,000, నిఫ్టీ 20,000 కీలక మైలురాళ్ల నుంచి కిందకి జారుకున్నాయి.



ఏరోస్పేస్ రంగానికి గేర్ బాక్స్‌లు

- స్కంద ఏరోస్పేస్ తయారీ
- హైదరాబాద్‌లో యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్

నగర కేంద్రంగా పని చేస్తోన్న రఘువంశీ మెషీన్ టూల్స్, అమెరికన్ సంస్థ రేవ్ గేర్స్ ఎల్‌ఎల్‌సి సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన స్కంద ఏరోస్పేస్ టెక్నాలజీ ప్రయివేటు లిమిటెడ్ (ఎస్‌ఎటిపిఎల్) తన అత్యాధునిక గేర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఏరోస్పేస్-స్టాండర్డ్ గేర్లను తయారు చేసే ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, తెలంగాణ ప్రభుత్వ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ లాంచనంగా ప్రారంభించారు. "స్కంద ప్రారంభోత్సవం భారత ఏరోస్పేస్, రక్షణ రంగ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, కీలకమైన రంగాలలో దేశం స్వావలంబనకు దోహదపడే దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ఏరోస్పేస్ సామర్థ్యాలను ముందుకు తీసుకెళ్లడంలో భారతదేశపు స్థిరమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.దేశం పురోగతి సాధిస్తున్న తరుణంలో, స్కంద నుంచి వస్తున్న ఈ సరికొత్త, అధునాతన ప్లాంటు భారతదేశంలో, ప్రపంచ వేదికపై ఏరోస్పేస్ తయారీ భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందనే వాగ్దానాన్ని కలిగి ఉంది" అని రఘువంశీ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ వికాస్ పేర్కొన్నారు.

13 నుంచి ఇంటీరియర్ ఎక్స్‌పో

నగరంలో డిజైన్ డెమోక్రసీ ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్



ఇంటీరియర్, లైఫ్‌స్టైల్‌కు సంబంధించి ప్రీమియర్ డిజైన్ ఫెస్టివల్, డిజైన్ డెమోక్రసీ 2023ను అక్టోబర్ 13 నుంచి 15 తేదిల్లో ఏర్పాటు చేస్తున్నట్లు డిజైన్ డెమోక్రసీ వ్యవస్థాపకురాలు పల్లికా శ్రీవాస్తవ్, శైలజా పట్వారీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. నగరంలోని ఎన్ కన్వెన్షన్‌లో జరుగనుందన్నారు. ఇందులో 70 మంది ఎగ్జిబిటర్లు తమ ఫర్నీచర్, ఇంటీరియర్ డిజైన్ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆర్డర్‌పై కొనుగోలు కూడా చేసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. దేశంలోని ప్రధాన నగరాల నుంచి ఎగ్జిబిటర్లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఫర్నిచర్, లైట్లు, కార్పెట్‌లు, సాఫ్ట్ ఫర్నిషింగ్‌లు, యాక్సెసరీలు, ఫైన్ ఆర్ట్‌తో సహా పలు విభాగాల్లో దాదాపు 60కి పైగా లగ్జరీ బ్రాండ్‌లు ఇక్కడకు రానున్నాయని ఈవెంట్ క్యూరేటర్ అర్జున్ రాఠీ తెలిపారు.

ఐడిబిఐ బ్యాంక్ 'అమృత్ మహోత్సవ్' ప్లాన్ పొడిగింపు

హైదరాబాద్ : ఐడిబిఐ బ్యాంక్ తన అమృత్ మహోత్సవ్ ఎఫ్‌డి పథకాన్ని పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత పండుగ ఆఫర్లను విస్తరిస్తున్నట్లు పేర్కొంది. ఈ పరిమిత కాల ప్రమోషన్‌లో 444 రోజుల కాలపరిమితి ఎఫ్‌డి ఎంపికతో ఏడాదికి 7.75 గరిష్ట వడ్డీ రేటును, 375 రోజుల ఎంపికతో ఏడాదికి 7.60 శాతం వడ్డీ రేటు అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆఫర్‌ను అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో మూడు వినూత్న చెల్లింపులు

ముంబయి : కొత్తగా యుపిఐలో మూడు వినూత్న డిజిటల్ చెల్లింపుల ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడించింది. ఇందులో యుపిఐ 123పే ఐవిఆర్ ద్వారా చెల్లింపు, వ్యాపారి లావాదేవీల కోసం యుపిఐ ప్లగ్-ఇన్ సేవ, క్యూఆర్‌లో స్వీయ చెల్లింపులు ఉన్నాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డిజిటల్ బ్యాంకింగ్ కంట్రీ హెడ్ పరాగ్ రావ్ పేర్కొన్నారు.